# పెదకథ

## నువ్వంటేనే నాకిష్టం

విజయలక్ష్మి




'నువ్వంటే నా కిష్టం!'

'నువ్వంటేనూ నా కిష్టం' నవ్వి అన్నాను.

'గుడ్! అయితే మనిద్దరం...' అంటూ ఆగాడు విజయ్.

'ఊఁ! చెప్పూ!' అతనికేసి తిరిగాను.

'మనిద్దరం పెళ్ళి చేసుకుందాం!' చాలా స్పష్టంగా ఒక్కొక్క అక్షరమే పలుకుతూ అన్నాడు.

నాకు మొదట అతనన్నదేమిటో అర్థం కాక అయోమయంగా చూసాను.

'ఏం! అలా చూస్తావ్! నేను తెలుగే య్, మాట్లాడాను' కాస్త ముందుకు వంగి నా ముఖంలోకి చూస్తూ అన్నాడు.

అతనన్నదానిలో అర్థం బుర్రలోకి ఎక్కి, అమితమైన ఆశ్చర్యమూ తన్నుకొ కొంచెం కోపం వచ్చాయి.

బలవంతాన నవ్వి అన్నాను. 'నీ జోక్ అర్థం కాలేదు.'

నవ్వకుండానే నా ముఖంలోకి చూస్తూ 'సారీ! ఇది జోక్ కాదు' అన్నాడు విజయ్.

ఈసారి నేను కోపం ఆపుకోలేక పోయాను.

'మనిద్దరం పెళ్ళిచేసుకుందామా! ఆహా! ఎంతమంచి ఐడియా!' వ్యంగ్యంగా అని లేచి నిల్చున్నాను.

'ఔను మరి! వెరీగుడ్ ఐడియా!' అన్నాడతను ఏమీ చలించకుండా!

'నేను నిన్ను పెళ్ళిచేసుకోను' సీరియస్‌గా అన్నాను.

'నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అంతకంటే సీరియస్‌గా అన్నాడు.

విసురుగా నేను మెట్లు దిగి వచ్చేసాను. విజయ్ పిన్ని కమలమ్మగారు హాల్లో ఎదురయ్యి 'అప్పుడే వెళ్తున్నావే'మని అడుగుతున్నా వినిపించుకోకుండా వచ్చి ఇంట్లో పడ్డాను.

వచ్చానన్నమాటే గాని కూర్చున్నా, నిలుచున్నా, భోజనం చేస్తున్నా అతని మాటలు పదే పదే చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. నిజంగానే అతను నన్ను ఆటలు పట్టించడానికే అలా అని వుంటాడు. అందర్నీ ఇలానే ఏదో రకంగా హేళన చేయడం అతనికి సరదా! అదొక హాబీ! ఛీ! మరీ ఇంత మోటు హాస్యమా! ఇతనికి రాను రానూ పట్టపగ్గాలు లేకుండా పోతూంది. వాళ్ళమ్మా, నాన్నకి ఒకడే కొడుకు అవడం

మూలానా బాగా గారాబం చేసి చెడగొట్టా సారు. లేకపోతే అంతతో వాకు పెళ్లే మిటి! నాకంటే సంవత్సరం చిన్నవాడు. ఒకవేళ, వాడు ఉడు మించి పోతున్నా ఇంకా పెళ్ళి కాలేదన్న అపహాస్యం కాబోలు! ఛీ! చివరికి అతను కూడా హేళన చేసే వాడే! కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చనువుగా ఉన్నందుకు, సరదాగా మాటా డినందుకు మంచి పాఠం నేర్పాడు!

సెలవులకి వాళ్ళ పిన్నిగారి ఇంటికి మద్రాసు నుంచి వడపాదడపా అయి దేళ్ళ నుంచీ వస్తున్నా, అతనితో చనువుగా ఉన్నది, అతను క్రితం సారి వచ్చినప్పటి నుంచే! విజయ్ ఎప్పుడూ చలాకీగా ఉంటూ, సరదాగా మాట్లాడుతూ వీలైన వాళ్ళ నల్లా హాస్యాలు పట్టిస్తూ ఉంటాడు. అయినా అందరికీ అతనంటే ఇష్టం. అతనిలో మహత్యం ఏమిటో మరి! చిన్న వాళ్ళ సంగతటుంచి, పెద్దవాళ్ళకు సైతం అతనంటే వెర్రి ఇష్టం! చుట్టుపక్కల వాళ్ళు, చివరికి అమ్మ, నాన్నగారు కూడా కమలమ్మగారిని 'విజయ్ ఎప్పుడు వస్తాడు?' అని అడుగుతూ ఉంటారు.

విజయ్ అంత కలుపుగోలుగా ఉన్నా, నే నెప్పుడూ అతనితో ఎక్కువ మాట్లాడే దాన్ని కాదు. అతనూ నాతో అట్టే మాట్లాడేవాడు కాదు. ఇంకా చెప్పాలంటే, నేను విజయ్ సెలవులకి వచ్చినప్పటికంటే, అతను లేనప్పుడే వాళ్ళ పిన్నిగారింటికి ఎక్కువ వెళ్తుండేదాన్ని శారద కోసం. విటొచ్చి అతను క్రితంసారి వచ్చినప్పుడే కాస్త సన్నిహితుడయ్యాడు. అందరితో హాస్యాలాడినా, నాతో చాలా ఆప్యాయంగా ఉంటాడు.

శారద విజయ్ పిన్నిగారి అంటే కమ లమ్మగారి అమ్మాయి. ప్రక్క ఇల్లు అవటంచేత, ఇద్దరం చదువు మానేసి ఖాళీగా ఇంట్లో కూర్చోవడంచేత మా ఇద్దరికీ స్నేహం బాగా అయింది. కానీ, మావి భిన్నస్వభావాలు! నాకంటే శారద మూడేళ్ళు పెద్దదే చిన్నది.

శారద వివాహం ఆరు నెలల క్రితం రఘుతో నిశ్చయం అయింది. రఘూ వాళ్ళ ఇల్లు కూడా మా ఇంటి దగ్గరలోనే. అతను విజయ్‌కి క్లాసుమేట్ మాత్రమే కాదు ఫ్రెండ్ కూడా. వాళ్ళు ఇద్దరూ సెలవులకి ఇక్కడికి వచ్చినప్పుడల్లా శారద, రఘు ఏకాంతం వెతుక్కుంటూ ఉంటారు. అందుకని తరచూ, నేను, విజయ్ మిగులు తుంటాం. మా ఇద్దరికీ చనువు పెరగ డానికి ఇది కూడా కారణం.

నాది క్రొత్తవాళ్ళతో ఎక్కువ మాట్లాడే స్వభావం కాదు. చాలా మౌనంగా ఉంటా నంటారు అందరూ! అలాంటిది విజయ్‌తో బాగా కలిసిపోయాను.

విజయ్ వచ్చి పది రోజులయ్యింది. పది నిముషాలులాగా గడిచిపోయాయి.

ఆశ్చర్యం ఏమిటంటే అందరూ ఉన్న ప్పుడు అతను ఒక్కడే వక్త, మిగిలిన అందరూ శ్రోతలే! మేమిద్దరమే ఉంటే నేనే ఎక్కువ మాట్లాడుతూ ఉంటాను. అతను వింటూ ఉంటాడు. అది గమనించిన తరువాత నాకు చాలా ఆశ్చర్యం అనిపిం చింది. అదే అతనితో అన్నాను. అతను నవ్వి అన్నాడు మొదటిసారిగా,

'నువ్వంటే నా కిష్టం!'

నాకు నవ్వొచ్చింది. నవ్వేసి ఊరుకున్నాను. ఇంకొక మార్పు. ఇదివరకు అతను నన్ను 'మీరు' అనేవాడల్లా, 'నువ్వు' లోకి మార్చే సాడు. నాకేమిటో ఇబ్బందిగా అనిపించినా, నేనేమీ అనలేదు పైకి.

నేను ఇదివరకు 'మీరు' అనేదాన్ని అతన్ని. అలాంటిది ఇప్పుడేమనాలో తెలీక పొడిమాటలు దొర్లించి అవస్థపడటం చూచి, అతనే నవ్వి నన్ను ఏకవచన సంబోధన చెయ్యమన్నాడు. అప్పటినుంచీ మరీ సన్ని హితులం అయ్యాం.

నాకు మంచి ఫ్రెండ్ దొరికాడు అను కున్నాను. అప్పటినుంచీ చాలాసార్లు మేమిద్దరమే ఉన్నప్పుడు విజయ్ 'నువ్వంటే నాకిష్టం' అనటమూ, నేను నవ్వి ఊరు కోవటమూ పరిపాటి అయింది.

ఇవాళ శ్రుతిమించి రాగానపడింది. విజయ్ నన్ను కూడా అపహాస్యం చేస్తున్నాడు. ఇది నేను సహించకూడదు.

ఇలా అనుకున్నా, మనసులో ఒకమూల 'ఇది హాస్యంకాదు, నిజమేమో'నన్న అను మానం ఉంది. కాని దాన్ని పెరగనివ్వ లేదు.

ఆ మర్నాడు విజయ్ వాళ్ళింటికి వెళ్ళ కూడదనుకున్నాను. పది గంటల వరకూ ఫరవాలేదుగాని, ఆపైన మనసు వాళ్ళ ఇంటివైపు పరిగెత్తటం మొదలుపెట్టింది. నాన్నగారు ఆఫీసుకి, తమ్ముడు కాలేజీకి వెళ్ళారు. అమ్మ నిద్రలో ఉంది. నాకేమీ తోచటంలేదు.

ప్రతిరోజూ ఈ టైమ్‌కి నేనూ శారద కబుర్లు చెప్పుకుంటాం! అయినా సరే, మళ్ళీ విజయ్‌దగ్గరకు వెళ్ళకూడదు అని దృఢనిశ్చయం చేసుకున్నాను ఏదో నవల తీసుకుని కూర్చున్నాను.

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీస్తే, ఎదు రుగా విజయ్! అతను మా ఇంటికి అంతకుక్రితం రెండుసార్లే వచ్చాడు. అదీ నాన్నగారి కోసం.

అలాగే తలుపు పట్టుకుని నిల్చునిపోయాను ఆశ్చర్యంగా. 'లోపలికి రానివ్వవా?' నవ్వుతూ అడిగాడు విజయ్.

తెప్పరిల్లి అడ్డు తొలిగాను. నాకంటే ముందే డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాడు. నేను వెనకే వచ్చాను. అన్నాను 'నాన్నగారు ఆఫీసుకి వెళ్ళారు. తమ్ముడు కాలేజీకి వెళ్ళాడు.'

'అలాగా! నేను వాళ్ళకోసం రాలేదు' అన్నాడు నావంకే చూస్తూ.

నేనేం మాట్లాడలేదు. ఇతనికి ఇంకా నిన్నటి మూడ్ పోయినట్లు లేదు.

'నీకోసమే వచ్చాను' అన్నాడు మళ్ళీ.

నేను మౌనంగా ఊరుకున్నాను.

'ఏం! నాతో మాట్లాడవా?' చిన్న పిల్లని లాలిస్తున్నట్లు అడిగాడు.

'ఏం మాట్లాడనూ!' శాంతంగానే అన్నాను.

'పోనీ, పోట్లాడు!' తెల్లటి పళ్ళు తళుక్కుమనేలా నవ్వి అన్నాడు విజయ్.

నేను కోపంతో ఏదో అనబోయాను. అమ్మ నిద్ర మెలుకువ వచ్చిందిలా ఉంది లేచి వచ్చింది. విజయ్‌ని చూసి, ముఖాన ఇంత చేసుకుని పలకరింపుగా నవ్వింది.

విజయ్ కూడా ఆత్మీయంగా మాట్లా డాడు. అమ్మని చూడ్దామనే వచ్చానన్నాడు కాసేపు ఆ మాటా, ఈ మాటా మాట్లాడి, సాయంత్రం అందరూ పబ్లిక్ గార్డెన్స్‌కి వెళ్తున్నారట, వాళ్ళ ఇంట్లో. కమలమ్మ గారు నన్నుకూడా తీసుకు రమ్మన్నారట. తను అమ్మని పర్మిషన్ అడుగుదామని వచ్చానన్నాడు. అమ్మ వెంటనే ఒప్పు

ఉంది. నేను శారదా తరచూ ఎక్కడికైనా వెళ్తూనే ఉంటాం. విజయ్ వచ్చాక, విజయ్‌తో కలిసి చాలా చోట్లకి తిరిగాం. కానీ, ఈసారి వెళ్టం నాకేమీ ఇష్టం లేదు గానీ, కమలమ్మగారు ప్రత్యేకం కబురు చేసారు కదా అని ఒప్పుకున్నాను.

అంతా చేస్తే, ఆ సాయంత్రం కమలమ్మగారు రానేలేదు మాతో. రఘు, విజయ్, నేను శారదమాత్రం వాళ్ళ కారులో బయలుదేరాం. విజయ్ ఇంటాక అబద్ధం చెప్పాడా అన్న అనుమానం వచ్చింది నాకు. అక్కడికి వెళ్ళాక 'వాకింగ్' అంటూ శారద రఘు బయలుదేరారు. విజయ్‌కూడా వాళ్ళతో వెళ్తాడనుకుని, నేను బద్ధకంగా ఉంది రాను అంటూ అక్కడే ఒక పావ దగ్గరే కూర్చున్నాను.

వెంటనే విజయ్ కూడా రానన్నాడు. అలసటగా ఉందన్నాడు. పైగా నాకు తోడు అంటూ తనూ అక్కడే కూర్చున్నాడు. నాకు చిరాకేసింది. నేనూ వాళ్ళతో పాటు వెళ్తానూ అని ఆలోచించేలోగానే, వాళ్ళిద్దరూ ఏకాంతం దొరికిందిదా అన్న ఉత్సాహంతో వెళిపోయినట్లున్నారు. నేను, విజయ్ మిగిలాం అక్కడ.

వాళ్ళు కాస్తంతదూరం వెళ్ళాక విజయ్ శారదవాళ్ళు వెనక్కు చూసి తాపీగా అన్నాడు. 'ఆఁ! ఇప్పుడు చెప్పు.'

ఏమిటన్నట్టు చూసాను.

'అదే, నన్ను పెళ్ళి చేసుకోక పోవడానికి గల కారణాలు. అంటే, నన్ను పెళ్ళి చేసుకోవడానికి గల అభ్యంతరాలు.'

ఆకీసారి నవ్వాలో, కోపడాలో అర్థం కాలేదు. 'నీకేం పిచ్చా. అమ్మమ్మా! అవేం మాటలూ!' దీర్ఘం తీస్తూ అన్నాను.

'ఆఁ! నాకు పిచ్చే! నీ పిచ్చి! నువ్వంటే పిచ్చి. సరే చెప్పు నన్నెందుకు చేసుకోవన్నావ్?' సమాధానం అత్యవసరం అన్నట్లుంది అతని వాలకం.

'వాగకు ఊరుకో! చిరుకోపంతో అన్నాను.

'అలా మాట్లాడటం నాకేమీ బాగాలేదు'

'అబ్బ! నేను ఇంత సీరియస్‌గా అడుగుతుంటే, నువ్వు అలా కొట్టిపారేస్తావేం? అటుగా ఉంది నా బోటి!' అన్నాడు. 'సమాధానం చెప్పకపోతే ఏం చేస్తానో తెలుసా?'

గడ్డి మునివ్రేళ్ళతో లాగుతూ నిర్లక్ష్యంగా అన్నాను. 'ఏం చేస్తావేం?'

'మంచిగా చెబితే వినకపోతే ముక్కుకి తాడేసి లాక్కెళ్ళి నీ మెళ్లో తాళి కట్టేస్తా.'

చటుక్కున అతనివంక చూసాను. చిలిపిగా నవ్వుతున్నాడు. నాకు ఒక్క నిముషం కలవరం మొదలయి, మెల్లిగా తగ్గింది.

'సరే! ఇప్పుడడుగుతున్నా చెప్పు. ఏమిటి నీ అభ్యంతరం?' నా ముఖంలోకి గుచ్చి చూస్తూ అడిగాడు. నేను అతని వంక చూడలేక కళ్ళు దించుకున్నాను.

'ఏం, నేను అందంగా లేనా?' అతని కంఠంలో గూఢంగా గర్వం ధ్వనించింది. నేను అతనికేసి ఓరగా చూసి, అతను నా వంకే చూస్తున్నాడని తెలిసి చటుక్కున చూపు మరల్చుకున్నాను.

'నేను చదువుకోలేదా?!' మళ్ళీ అడిగాడు.

నా సమాధానం రాకపోయేసరికి, మళ్ళీ అన్నాడు

'నువ్వు బి. ఏ. చదివితే, నేను నీకంటే చాలా ఎక్కువే చదివాను. ఇంకా చదువుతాను' దర్పంగా చెప్పాడు.

నేను మౌనంగా కూర్చున్నాను,

విజయ్ చప్పున ముందుకు వంగి నా ముఖం దగ్గరగా ముఖంపెట్టి అన్నాడు. 'పై చదువుకి వచ్చేఏడు అమెరికా వెళ్ళాలనుకుంటున్నాను. మనం ఇద్దరం కలిసి వెళ్దాం పద్మా!' చాలా అనునయంగా చెప్పాడు.

నన్ను కాదన్నట్టు, నేను ఎటో చూస్తూ ఉన్నాను. అతనికి కోపం వచ్చినట్టుంది 'మాట్లాడవేం!' అని రెట్టించాడు.

అప్పటికీ నేను మౌనంగా ఉన్నాను.

'నేను నా భార్య, బిడ్డల్ని పోషించలేనని నీకు అనుమానమా? కాస్తంత ఎగతాళిగా అడిగాడు.

ఇతని దర్పానికి అంతెక్కడ!

అతని మాటలు నన్ను ఇబ్బందిలో పెడుతున్నా పైకిమాత్రం, హాస్యంగా తీసుకున్నట్లు ఉండాలని తేలిగ్గా నవ్వేసాను.

విజయ్ నావైపు రోషంగా చూసాడు. క్రింది పెదవి పైపంటితో నొక్కుకుంటూ 'ఇలా నవ్వకు' అన్నాడు.

నేను ఇంకా నవ్వి అన్నాను 'పెళ్ళాడాలంటే ఈ క్వాలిఫికేషన్స్ చాలన్న మాట!'

'నేను నిన్ను గాఢంగా, అతిగాఢంగా, గాఢాతిగాఢంగా ప్రేమిస్తున్నాను. ప్రేమిస్తున్న నీ ప్రేమే నాకు ఊపిరి. దానికోసం సముద్రాలైనా ఈదేస్తాను. పర్వతాలు దాటేస్తాను. కొండల్ని పిండేస్తాను. నువ్వేం చెయ్యమంటే అది చేసేస్తాను. నువ్వే నా ప్రాణం, నా జీవం. నాదైవం...'

నేను తెల్లబోయి చూస్తున్నాను. విజయ్ వైపు. అతను నవ్వి 'ఇలాంటి డైలాగ్స్ చెబితేగాని నమ్మవా?'

నేను కోపంగా ముఖం తిప్పుకున్నాను. విజయ్ చేతులు దులుపుకుని సరిగ్గా నా ఎదురుగా కూర్చుని చెప్పాడు 'నువ్వన్నట్లు ఈ క్వాలిఫికేషన్స్ చాలవు పద్మా! అంతకంటే ముఖ్యమైన క్వాలిఫికేషన్ నాకుంది.'

క్షణం ఆగి మళ్ళీ అన్నాడు 'నువ్వంటే నాకు చాలా ఇష్టం. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. నిన్ను ఎప్పుడూ సంతోషంగా ఉంచడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. నిన్నెప్పుడూ నొప్పించను. నేను చాలా మంచి భర్తని, సిన్సియర్ భర్తని అవుతాను. నిజం!'

విజయ్ లోస్వరంలో అన్నమాటలు నాలో ఏదో కలవరం లేపింది. అటువంటి కలవరం నేనింతకుముందు ఎరగను. ఏదో చెప్పలేని భావం గుండెల్లో పొంగింది. అది నా ముఖంలో కూడా కనిపించి ఉండాలి. ఆ భావం నాకు బాధగా ఉందో, ఆనందంగా ఉందో కూడా చెప్పలేని స్థితి. ఆ భావంతో ఉక్కిరిబిక్కిరి అయి తేరుకునేసరికి కాస్త సమయం పట్టింది.

విజయ్‌కేసి చూసాను. ఇంతకుముందు ఎప్పుడూ అతని ముఖం అలా లేదు. నావైపే చూస్తున్నాడు. నాకు చాలా క్రొత్తగా కనిపించాడు.


నేను తమాయించుకుని అన్నాను 'నువ్వు నాకంటే చిన్నవాడివి.'

విజయ్ వెంటనే అందుకున్నాడు 'నేను నీకంటే చాలా పొడుగున్నాను. నీకంటే లావుగానే ఉన్నాను. మరి నీకంటే నిస్సందేహంగా పెద్దవాడినే'

'అయితేనేం, సంవత్సరం చిన్నవాడివి వయస్సులో!'

**వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టరు**

**విన్నీ మాస్టర్**



3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ (గ్యారంటీతో) నెలకు రు. 10 వంతున చెల్లించి పొందండి. ఇండియాలో అన్ని గ్రామములకు, పట్టణములకు పంపగలము. అసలు ధర రు. 165/—

VISHAL AGENCIES
P. B. 2100, (APW) Delhi-7.

**గృహిణుల సుఖసంతోషాలకు టెస్లా**

లోతు బావులకు ప్రత్యేకముగా రూపొందించబడిన ½ H.P. సింగల్ ఫేజు జెట్ పంపు సెట్టు, సక్షన్ 70 అడుగులు, డెలివరి 65 అడుగులు. ఎట్టి సమస్యలు లేకుండ సునాయాసముగా నీటిని సరఫరా చేయును.

*High Pressure Water System*




మెసర్స్ శ్రీ శంకర్ ఫౌండ్రి & ఇంజనీరింగ్ వర్క్స్,
B-7, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చిత్తూరు (ఎ.పి)
ఇండియా అంతట ప్రతినిధులు లేనిచోట్లలో ఏజంట్లు కావలెను.

# నువ్వంటే నాకిష్టం

'నాన్సెన్స్! ఈ సంవత్సరం కూడా ఏం చేస్తుందంటావ్? మింగేస్తుందా?' విసుగ్గా అన్నాడు.

నేను అదేమి పట్టించుకోకుండా తాపీగానే చెప్పాను 'మింగెయ్యగల దానావు అంతపనీ చేస్తుంది. నీకంటే ఆలోచనల్లో, అభిప్రాయాల్లో, మంచి చెడుల విచక్షణలో సంవత్సరం పెద్దదాన్ని.'

కోపంతో రెచ్చిపోయాడు విజయ్. 'కనిపిస్తూనే ఉంది నీ పెద్దరికం, విచక్షణాజ్ఞానం, ఆలోచనలూ అన్నీ!' ఎగతాళిగా నవ్వాడు.

కాస్త ఆగి అన్నాడు 'ఏ సాహా, భర్త కంటే భార్య వయస్సులో పెద్దదవటానికి వీల్లేదన్న ఏ బి. సి. నాటి బూజు అభిప్రాయంలోనే తెలుస్తోంది నువ్వెంత చిన్నదానివో! నువ్వింకా చాలా పెరగాల్సి ఉంది!'

నేను చిన్నబుచ్చుకున్నాను.

'వరహీనం...' అంటూ చెప్పబోయాను మధ్యలోనే నా మాటలు కొట్టేసాడు విజయ్. 'చూడు పిల్లా! ఇవన్నీ పాత చింతకాయ పచ్చడి ఖబుర్లు. నీకు బాగా వంటబట్టాయి.'

ఇక లాభం లేదు. ఆఖరి అస్త్రం ప్రయోగించాలి మరి నోరెత్తకుండా,

'సరే, దీనికేం సమాధానం చెబుతావ్?' అవునా కాదా అని సందేహిస్తూ చూసాను.

'దేనికి?' అన్నాడు విజయ్.

సిగ్గు, బిడియం ప్రక్కకునెట్టి అన్నాను 'నువ్వు నాకంటే చిన్నవాడివి కదా. నే నెప్పుడూ నిన్ను చిన్న వాడివిగానే చూసాను. మరో అభిప్రాయం నాకు లేదు.'

'ఏ అభిప్రాయం' మొండిగా అడిగాడు.

ఒళ్ళు మండింది నాకు. అయినా నిదానంగా అన్నాను.

'నిన్ను చూస్తే ఎప్పుడూ పారవశ్యం కలగలేదు. ప్రేమభావం లేదు. నువ్వు కలిగించలేవు. దానికి కారణం నువ్వు నాకంటే చిన్నవాడివి కావడమే!'

విజయ్‌వంక చూసే ధైర్యంలేక దిక్కులు చూసాను. కానీ ఇది నిజంకాదు. కాదని నాకు తెలుసు. ఇదే నిజమయితే ఇంకా నాక అంతటి కలవరానికి లోనయి ఉండేదాన్ని కాదు.

విజయ్ నెమ్మదిగా అన్నాడు: 'నాకేసి చూడు మరి! దానికి సమాధానం చెబుతాను.'

తప్పని సరిగా అతనికేసి తిరిగాను. అతని పెదవులమీద, కళ్ళలోను నవ్వు మెరుస్తోంది. అది నన్ను మరింత కంగారు పెట్టింది.

'నువ్వన్నది నిజమేనా?' నవ్వుతూనే అడిగాడు.

నేను శక్తినంతా కూడదీసుకుని 'నిజమే' అని గొణిగాను.

అతనేం మాట్లాడలేదుగాని, చటుక్కున వంగి నా పెదవులమీద తన పెదవులు ఆనించాడు. అంతా క్షణంలో జరిగింది. దాదాపు రెండు నిమిషాలేమో, నాకు స్పృహ తప్పినట్లయింది. నేను ఏస్థితిలో ఉన్నానో నాకు తెలియలేదు. ఒళ్ళంతా చిరుచెమటలు పోసాయి. కానీ, ఏదో తియ్యనిభావం ఒళ్ళంతా నిండింది. అలా ఎంతసేపు ఉన్నానో నాకేతెలియదు. నా మనసు అధీనంలోకి వచ్చేసరికి విజయ్ మాట్లాడుతున్నాడు.

'ఇప్పుడు చెప్పు. నువ్వన్నది నిజమేనా?' అతని కళ్ళలో విజయగర్వం తరబ్బాడింది.

అది పబ్లిక్ పార్క్ కదా, ఎవరైనా చూసారేమోనని చుట్టుప్రక్కల చూసాను. మేము పొదచాటుగా ఉండటం మూలానా ఎవరూ పట్టించుకున్నట్లు లేదు.

నాకు ఇంకేం మాట్లాడాలో తెలియలేదు. ఇంక ఏం మాట్లాడినా అనవసరమే! నేనేమిటో విజయ్‌కి తెలిసిపోయింది.

నేను దూరంగా చూస్తూ కూర్చున్నాను.

విజయ్ మళ్ళీ ఏదో చెబుతూనే ఉన్నాడు: 'నిన్ను మొదటిసారి చూసినప్పుడే, అంటే అప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు నువ్వు నాకు నవ్వావు. మొదటిసారి నిన్ను ఏప్రిల్ నెలలో చూసాను. ఎంతో నెమ్మదిగా ఎవరితోను ఎక్కువ కలవకుండా ఉండేదానివి. నిన్ను నేను అప్పటినుంచే ప్రేమిస్తున్నాను. నువ్వంటే నాకీభావం ఫలానా అని తెలీదు. మరీ క్రితంసారి వచ్చినప్పటి నుంచీ నిన్ను చూడకుండా ఉండలేనంతగా కష్టంగా అనిపించింది తెలుసా? నువ్వంటే నాకెంతో ఇష్టం!'

'అబ్బబ్బ! ఎన్నిసార్లు చెబుతావు సోది!'

విసుక్కున్నాను:

'నువ్వు నన్ను పెళ్లి చేసుకునేంత వరకూ?

'ఆ తర్వాత చెప్తున్న మాట!' అన్నాను. విజయ్ మాత్రం నిశ్చలంగానే అన్నాడు 'ఉహుఁ! మాటల్లో, చెప్పను. చేతల్లో, చూపుతాను.'

మళ్ళీ అన్నాడు 'అయితే, పెళ్ళికి నువ్వు ఒప్పేసుకున్నట్లే నన్నమాట!'

సరే, మళ్ళీ మొదటికి వచ్చింది వ్యవహారం! ఏం మాట్లాడను? వీళ్ళు ఇంకా రారేం?

విజయ్ తలక్రింద చేతులు పెట్టుకుని పడుకుని చెబుతూనే ఉన్నాడు. భవిష్యత్తులో తను వేసుకున్న ప్లాన్సు. మా రాబోయే బంగారు దాంపత్య జీవితం. ఇంకా ఏమిటేమిటో...... అతని మాటలు ఇంకా కాస్సేపు వింటే నేనేమయిపోతానో నాకే తెలియలేదు. లేచి నిలబడి శారదా వాళ్ళకోసం చూసాను. దూరంగా వస్తూ కనిపించారు.

విజయ్ మాటలకి అడ్డుపడుతు చెప్పాను వాళ్ళు వస్తున్నారని. అతను అయిష్టంగానే లేచి నాచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. నేను వదిలించుకున్నాను విసురుగా 'ఛ వాళ్ళు చూస్తారు!'

అతని కళ్ళు కొంటెగా మెరిసాయి. 'ఏం, చూస్తే? నేను నీకంటే చిన్నవాడినేగా!' వెక్కిరింతగా అన్నాడు. నా ముఖం ఎర్రబడింది.

ఇద్దరం వాళ్ళకి ఎదురువెళ్ళాం...అమ్మయ్య! ఇప్పటికా వచ్చారు! నాకెంత బోర్ కొట్టిందో తెలుసా?' అన్నాను.

విజయ్ ఏమీ మాట్లాడలేదు. అతను మామూలుగానే ఉన్నాడు గానీ, నాకే ఏమిటో క్రొత్తగా, ఇబ్బందిగా ఉంది. వాళ్ళని ఏదో మోసం చేస్తున్నట్లు ఫీలయ్యాను.

నేను ఊరుకోకుండా మళ్ళీ అన్నాను శారదతో 'ఎంత బోర్ కొట్టిందో తెలుసా నాకు?' విజయ్ నావంక కోపంగా చూసాడు. నేను నవ్వుకొన్నాను.

విజయ్ అన్నాడు 'అబ్బ! ఈ వదినకి ఇలా ఎంటర్‌టైన్ చెయ్యాలో కూడా తెలీదు. చాలా మౌనంగా ఉంటుంది.' విసుగ్గా ముఖం పెట్టాడు. నాకు చాలా కోపం వచ్చింది. అతనివైపు చుర చుర చూసాను. అతను కళ్ళతో నవ్వుతున్నాడు.

'అదేమిటి? వదిన మంచి కాన్వర్సేషనలిస్ట్ తెలుసా? గంటలు నిముషాల్లా ఉంటాయి తనతో ఉంటే!' అంది శారద.

'అబ్బో!' అంటూ వెక్కిరింతగా కళ్ళెగరేసాడు విజయ్. నేనేమీ పట్టనట్టు కూర్చున్నాను.

ఇంటికి రాగానే నిలువుటద్దం ముందు నన్ను నేను చాలాసేపు పరిశీలించి చూసుకొన్నాను. విజయ్ వంటి వాడిని ఆకరించగల ప్రత్యేకత నాకేమీ కనబడలేదు.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఆలోచిస్తూనే ఉన్నాను. క్రితం రాత్రి వరకూ ఎంత ప్రశాంతంగా నిద్రపోయేదాన్ని! మనసులో ఏదో ఆందోళన! ఏదో భయం! ఏదో బాధ! ఇవన్నీ కాక వీటి వెనకగా ఎక్కడో ఏదో ఆనందం! విజయ్‌ని మర్చిపోలేకుండా ఉన్నాను.


విజయ్ తల్లిదండ్రులు కళ్ళలో మెదిలారు. ఈ సంగతి తెలిస్తే వాళ్ళెంతబాధపడతారు! ఏ తల్లిదండ్రులు ఒప్పుకొంటారు తమ కొడుకు తనకంటే పెద్దదాన్ని చేసుకుంటానంటే! అసలు విజయ్ మాత్రం! ఏదో యువకరక్తం కాబట్టి ఇలాంటి పిచ్చి అభిప్రాయాలు వస్తూంటాయి. అవి నేను నిజమేనని నమ్మితే...! కొన్నాళ్ళయ్యాక, అతనే, నేనెప్పుడైనా ఎదురైతే సిగ్గుపడతాడేమో! సిగ్గు పడడేమో! అతనికి సిగ్గేమిటి? అసహ్యపడతాడేమో బహుశా! 'ఈ అమ్మాయిని ప్రేమించావని నేను అప్పుడు ఎలా అనగలిగానబ్బా!' అని ఆశ్చర్యపడతాడేమో! అమ్మ, నాన్నగారు కూడా ఇలాంటిది జరిగిందంటే బాధపడరూ!

ఇంత ఆలోచించాక నామీద నాకే కోపం వచ్చింది. విజయ్‌కి బుద్ధి లేదనుకుంటే నా కంతకంటే బుద్ధి లేదు. అసలు అతనితో అంత చనువుగా ఎందుకుండాలి? అంత చొరవ ఎందుకివ్వాలి? నాకేదో అన్యాయం జరిగినట్టుగా అనిపించింది. నాకు తెలియకుండానే వెచ్చటి కన్నీరు దిండుమీద పడింది. ఇప్పుడేమనుకొని ఏం లాభం? ఇకనైనా బుద్ధిగా మెలగాలి.

ఇక శారదా వాళ్ళ ఇంటికి వెళ్ళకూడదు. విజయ్‌ని కలవకూడదు. అహఁ! అసలేం లాభం లేదు. వాళ్ళే ఇక్కడికి వస్తారు. అదీకాక శారద ఏమైనా అనుకుంటుంది. విజయ్‌తో ఒంటరిగా కలవకూడదు. అవసరం అయితే తప్ప మాట్లాడకూడదు.

ఇప్పుడు నా మనసు తేలిక పడినట్లుంది కాని, ఏదో పోగొట్టుకున్నాననే బాధగా ఉంది. కాస్సేపయ్యాక నిద్ర పట్టింది.

ఆ మర్నాటినుంచీ నేను తీసుకున్న నిర్ణయాలు అక్షరాలా అమలులో పెట్టాను.



# నువ్వంటే నాకిష్టం

కానీ దాని కొంతో కష్టపడవలసి వచ్చింది; విజయ్ నన్ను పలకరించడానికీ, ఏకాంతంగా మాట్లాడడానికి ఎంతో ప్రయత్నం చేసాడు. నేను సాగనివ్వలేదు. అయినా అతని కని పెట్టాను. చాలా ముభావంగా ఉండటం మొదలు పెట్టాడు.

ఒకరోజు నేను, శారద, విజయ్ కూర్చుని మాట్లాడుతూంటే హాల్లో ఫోన్ మ్రోగిందని శారద వెళ్ళింది. నేనూ చటుక్కున లేచి తన వెనకే వెళ్ళబోయాను. విజయ్ 'నువ్వెందుకు —? నువ్వు కూర్చో!' అంటున్నా వినిపించుకోకుండా వచ్చి హాల్లో శారద ప్రక్కనే నిల్చున్నాను. విజయ్ కూడా బయటికి వచ్చి గది గుమ్మానికి ఆనుకొని నావేపే చూస్తూ నిలబడ్డాడు. అది కోపమో మరేమిటో నాకర్థం కాలేదు.

విజయ్ రేపు వెళ్ళిపోతాడనగా, ఉదయం గండిపేటకి పిక్నిక్ ప్రోగ్రాం వేసుకున్నారు. నన్నూ రమ్మంది శారద. నేను రానన్నాను. కాని తను వదలకుండా వచ్చి అమ్మను అడిగింది. వాళ్ళమ్మచేత కూడా రికమెండ్ చేయించింది. నాకు వెళ్ళటం తప్పని సరి అయింది. విజయ్ మాత్రం రమ్మనిగాని, వద్దనిగాని అనలేదు. తనకి పట్టనట్టు ఊరుకున్నాడు. అసలు నేనెవరో తనకి తెలియనట్టు ఉండి పోయాడు. అతనికి చాలా కోపం వచ్చిందని గ్రహించాను.

తీరా అక్కడికి వెళ్ళాక శారద అమ్మ గారు, నాన్నగారు గెస్ట్‌హౌస్‌లో ఉండి పోయి, బయటికి రామన్నారు. శారద నీళ్ళలో ఆడుకోవాలంది. తనవెంట రఘు బయలుదేరాడు. శారద విజయ్‌ని, నన్నూ రమ్మంది. విజయ్ బయలుదేరాడు. అందు కని నేను రానన్నాను. కాని శారద ఊరుకో లేదు. శారద అమ్మ, నాన్నగారు 'ఆడ మాతో ఉంటే నీకు తోచదు. సరదాగా పిల్లలతో వెళ్ళి ఎంజాయ్ చెయ్యండి' అన్నారు.

నలుగురం నీళ్ళదగ్గిరికి వెళ్ళాం. శారద చాలా ఉత్సాహంగా ఉంది. గబగబ నీళ్ళ లోకి వెళ్ళి వాళ్ళు ముగ్గురూ ఒకళ మీద ఒకళ్ళు నీళ్ళు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్నారు. వాళ్ళని చూస్తూ అక్కడున్న పెద్ద బండలమీదే నిల్చుండిపోయాను. శారద నన్నూ నీళ్ళలోకి రమ్మంది.

నేను రానన్నాను. చాలాసేపు బతిమిలాడి విసుగుపుట్టి ఊరుకుంది. విజయ్ నాతో మాట్లాడనే లేదు. కనీసం నావైపు కూడా చూడలేదు. నేనిది గ్రహించాను.

కాసేపు అక్కడే నుంచుని, ఇవతలికి వచ్చి ఒక పెద్ద చెట్టుక్రింద కూర్చున్నాను. వాళ్ళ కేకలు లీలగా వినబడుతున్నాయి, కాని, వాళ్ళు కనబడటం లేదు. అక్కడ అంతా ప్రశాంతంగా ఉంది. కనుచూపు మేరలో ఎవరూ లేరు. నేను తెచ్చిన మేగజైన్ తిరగేస్తూ, ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను. మెల్లగా గాలి వీస్తోంది. నాకు మత్తుగా ఉండి చెట్టు మొదలుకి ఆనుకుని కళ్ళు మూసుకున్నాను.

అయిదు నిముషాలకి వెనకగా అడుగుల చప్పుడయితే చటుక్కున కళ్ళు తెరిచి చూసాను. పాంటు పైకి మడచుకుని, చెప్పులు చేత్తో పట్టుకుని విజయ్ గబ గబ నా వైపే వస్తున్నాడు. నేను లేచి సరిగ్గా కూర్చునేసరికే నాదగ్గరకు వచ్చేసి నా ప్రక్కనే కూర్చున్నాడు.

నాకేం చెయ్యాలో తెలియలేదు. అతను అలా వచ్చేస్తాడని నేను అనుకోలేదు. ఏం చేస్తాను అని ఆలోచించే లోపే అతను మాట్లాడటం మొదలు పెట్టాడు.

'నీకంత కోపం తెప్పించే పనులు నేనేం చేసాను. నాతో మాట్లాడటం మానేసావ్?'

నవ్వుతూ అన్నాడు మళ్ళీ. 'కోల్డ్‌వార్ ప్రకటించినట్లు లాగుందే.'

నేనేదైనా మాట్లాడతానని ఆగి చూస్తున్నాడు. నేనేం సమాధానం చెప్పక పోయేసరికి, తిరిగి రెట్టించాడు 'నాతో మాట్లాడదల్చుకోలేదా?'

అయినా నేనేం మాట్లాడలేదు.

'పోనీ నేను చేసిన తప్పేమిటో చెప్పి మాట్లాడటం మానెయ్.'

నేను మౌనంగనే ఉన్నాను. తిరిగి అతనే అనునయంగా అన్నాడు. 'చూడు పద్మా! నువ్విలా మూగనోము ఎందుకు పట్టావో తెలీటంలేదు. ఈ నాలుగురోజు లనుంచీ నేనెంత బాధపడుతున్నానో నీకు తెలుసా?' అతను చాలా బాధపడుతున్నాడని అతని కంఠస్వరమే చెబుతోంది. నా మనసు కరిగిపోతుంది.

లాభం లేదు. ఇక్కడ ఉండటం క్షేమం కాదు.

లేచి నిలబడ్డాను వెళ్ళిపోవడానికి. విజయ్ చటుక్కున నా చెయ్యి పట్టుకుని లాగుతూ అన్నాడు 'ప్లీస్! పద్మా! వెళ్ళిపోకు.' చాలా అర్థింపుగా ఉంది కంఠం. 'ప్లీస్! వెళ్ళొద్దు. నీతో మాట్లాడాలి.'

'నాకు తెలుసులే ఏం మాట్లాడాలో! చెయ్యి విడువు నే వెళ్ళాలి.' వీలైనంత విసుగు తెచ్చిపెట్టుకుంటూ అన్నాను.

'దయచేసి వెళ్ళిపోకు' ఒక్కసారిగా లాగాడు నా చేతిని. నేను వెళ్ళి అతని దగ్గరగా కూలబడ్డాను. చాలా కోపంగా అతనివైపు చూసాను గాని, అతని ముఖం చూస్తే నా కోపం ఎగిరిపోయింది. ఇక కూర్చోకపోతే ఊరుకోడు. బలవంతంగా కూర్చోబెడతాడు. దానికోసం అతనేమైనా చెయ్యగలడు.

నేను బుద్ధిగా సర్దుకుని కూర్చున్నాను. విజయ్ తృప్తిపడి తనూ సరిగా కూర్చున్నాడు.

'నేను రేపు వెళ్ళిపోతున్నాను. నీకు తెలుసుకదా ఇప్పుడైనా నువ్వు నాతో సంతం కట్టి మాట్లాడక పోవడం! నీతో ఒంటరిగా మాట్లాడాలని ఎంత ప్రయత్నించానో తెలుసా? ఎందుకలా తప్పుకు తిరిగావ్?' చాలా నెమ్మదిగా, నిష్ఠూరంగా అన్నాడు.

నేను అతనివైపు చూస్తున్నదాన్నల్లా ముఖం తిప్పుకున్నాను.

'నువ్వు మహా మొండిదానివి. నీ మొండి తనానికి విరుగుడు చెప్పనా?' అతని కంఠం మారింది. ఇందాకటి అర్థింపు పోయి, కొంటెదనం తొంగిచూసింది.

'అమాంతం నిన్ను పెళ్ళాడేయ్యాలి. అప్పుడుగాని నువ్వు దారిలోకి రావు.'

అతని వంక చూసాను. నవ్వుతున్నాడు. నవ్వుతున్నప్పుడు విజయ్ ఎంత అందంగా ఉంటాడు!

ఈ ఆలోచన రాగానే నన్ను నేను తిట్టుకున్నాను. నేను చేసుకొన్న నిర్ణయాలు గాలిలో కలుస్తున్నాయి. నా మనసు నేను చెప్పినట్టు వినడం లేదు.

(ముగింపు పై వారం)



# నువ్వంటే నాకిష్టం

[గతసంచిక తరువాయి]

విజయ్‌కి గట్టిగా ఘాటుగా సమాధానం చెప్పాలి. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీదుగాని, నోటికి వచ్చినట్టు మొదలు పెట్టాను.

విజయ్! నేనొకమాట చెబుతాను వింటావా ?'

'ఓ! యస్! వినడానికే అయితే అభ్యంతరంలేదు.' చాలా ఈజీగా అనేసాడు.

'నువ్వు ప్రేమా గీమా అంటూ పిచ్చి మాటలు మాట్లాడకు. మీ అమ్మగారికీ, నాన్నగారికీగాని తెలిసిందంటే అనవసరంగా గొడవ పడతావు. ఎందుకు చెప్పు ఇలాంటి పనులు చెయ్యడం!'

'అయ్యిందా ఉపన్యాసం ?' అన్నాడు విజయ్.

నేను నవ్వులాటకి చెప్పటంలేదు. నిజంగా మీ అమ్మగారి దగ్గరికి వెళ్ళి పెళ్ళి చెయ్యమని అడుగు. చక్కని పిల్లని చూసి పెళ్ళి చేసేస్తారు. అంతేకాని ఇలా చెయ్యటం ఏం బాగుండలేదు.' శాంతంగానే చెప్పా.

'ఎలా చెయ్యటం ?' అని నవ్వి ఊరుకుంటనే అన్నాడు.

'నువ్వు ఇలా చెయ్యటం ఏం బాగులేదు. ఎందుకింత మొండి పట్టుదల నీకు?

కాసేపు ఇద్దరం మౌనంగా ఉన్నాం. ఉన్నట్టుండి విజయ్ అన్నాడు 'అసలు నా పెళ్ళి నిశ్చయం అయిపోయింది తెలుసా? పెళ్ళి నిశ్చయం అయింది.'

నేను ఉలిక్కిపడ్డాను. శారద నాకీ విషయం ఎన్నడూ చెప్పనేలేదు. అయితే విజయ్ పెళ్ళి నిశ్చయం అయ్యాకే నాతో ఇలా ఆడుకుంటున్నాడన్నమాట!

నా ముఖంలో భావాలన్నీ చదివినట్టున్నాడు. అతను సన్నగా నవ్వాడు. 'ఏం! అంత ఉలికిపడ్డావ్! నన్ను పెళ్ళిచేసుకోవడం నీకిష్టం లేకపోతే ఆ ఉలికిపాటు దేనికి ?'

నేను తమాయించుకుని అడిగాను: 'ఆ అమ్మాయి ఎవరు? నాకు చెప్పలేదేం?'

'నేను ఎవర్ని చేసుకుంటే నీకెందుకు? నీకు చెప్పాలని ఎక్కడుంది?'

అవును. నిజమే! కాని...కాని... నాకేదో బాధగా ఉంది. విజయ్ నన్ను మోసం చేసాడనిపిస్తోంది. నేను క్రిందికి చూస్తూ కూర్చున్నాను.

విజయ్ నాచేతిని తన చేతిలోకి తీసుకుంటూ నవ్వాడు 'పిచ్చి పద్మా! నా పెళ్ళి నిశ్చయం అయ్యింది అనగానే దిక్కుముఖం పెట్టేసావేం ?'

మృదువుగా అడిగాడు 'నేనంటే నీకిష్టమే కదూ ?'

నా మనసులోని భావాలు అతను పుస్తకంలా చదివేస్తుంటే, నా అసహాయతకి నాకే కోపం వచ్చింది.

విజయ్ మళ్ళీ అన్నాడు 'నిశ్చయం లేదు, ఏమీ లేదు. నువ్వు ఒప్పుకుంటే, మన పెళ్ళి రేపే నిశ్చయం అవుతుంది. పెళ్ళీ అవుతుంది.'

నన్ను ఆడించడాని కన్నట్లు అతను అబద్ధం ఆడాడు. నేను కోపం తెచ్చుకుందామనుకున్నాను. కానీ నా మనసు తేలిక అయి సంతోషంగా వుంది. అయినా కోపం నటిస్తూ అన్నాను 'చాలు, చాలు. ఇంకేమీ చెప్పకు' విసురుగా చెయ్యి వదిలించుకున్నాను.

'మన పెళ్ళి దాదాపు నిశ్చయం అయినట్టే! నువ్వు ఒప్పుకోవటం ఒక్కటే ఆలస్యం. అదీ అయిపోతుంది కొద్ది రోజుల్లో!' చాలా నమ్మకంగా చెప్పాడు.

'హోహో! నేను ఒప్పుకుంటానని నీకు తెలుసునన్న మాట!' ఎగతాళిగా అన్నాను.

'ఆ! ఒప్పుకుంటావు. తప్పకుండా ఒప్పుకుంటావు. కాకపోతే, బాగా బ్రతిమాలాడించుకోకుండా ఒప్పుకోవడం ఏమిటని బెట్టు చేస్తున్నావు. అంతే!'

నేను కోపంతో మాట్లాడలేదు. ఇంతలో రఘు, శారద రావటం చూసాను. ముఖం మీదికి నవ్వు తెచ్చేసుకుని పలకరింపుగా అన్నాను 'అయ్యయ్యో మీ జల్సకిడలు!'

శారద బాగా అలిసిపోయింది. విజయ్ వంక చూస్తూ అంది 'పద్మ ఒక్కతే ఉండి. ఆ సంగతి నాకు తెలియదుగాని, మరి నువ్వు కూడా ఉండకుండా వచ్చేసావేం? నువ్వూ తనని చూసి నేర్చుకుంటున్నావా?'

విజయ్ లేస్తూ అన్నాడు 'మీ ఇద్దరి మధ్యా నేనెందుకు? నేను అక్కడ ఉన్నా ఆకాసేపటికే అక్క పారిపోవాలనే తిట్టుకుని ఉంటారు.' శారద నవ్వేసి ఊరుకుంది.

గెస్ట్ హౌస్‌కి వచ్చాం. తినుబండారాలన్నీ తినేసాక, శారద నాన్నగారు, రఘు చెస్ ఆడటం మొదలుపెట్టారు. శారద అక్కడే కూర్చుని సలహాలు ఇస్తోంది. కమలమ్మగారు అందరికీ కాఫీలు అందిస్తున్నారు. నేను చూస్తూ నిలబడ్డాను.

నాకు నిద్ర వచ్చినట్లుగా ఉంది. లోపలికి వెళ్ళాను. ఆ గదిలో విజయ్ పడుకుని నవల చదువుతున్నాడు. నేను అటూ, ఇటూ చూస్తున్నాను ఎక్కడ పడుకోనా, అని. విజయ్ అది గమనించి మెల్లిగా అన్నాడు 'ఇక్కడే పడుకోరాదూ, బోలెడు స్థలం వుంది!' తన ప్రక్కనే చోటు చూపిస్తూ.

నేను తెల్లబోయాను. అతనికి దగ్గరగా వెళ్ళి చురచుర చూస్తూ గొంతు తగ్గించి 'నీకేం బుద్ధి లేదూ? వాళ్ళు వింటే...?'

'వినలేదుగా, అయినా వినకపోతే ఫరవా లేదన్నమాట!' విజయ్ కూడా గొంతు తగ్గించి అన్నాడు.

'ఇక అతనికేం సమాధానం చెబుతాను! విసవిసా ఇవతలకి వచ్చేసాను.

ఆ మర్నాడే విజయ్, రఘు వెళ్ళిపోయారు. అందరికి చెప్పినట్టే నాకూ గుడ్‌బై చెప్పి వెళ్ళాడు విజయ్.

అతను వెళ్ళిపోయాక అంతా వెలితిగా ఉన్నట్టు అనిపించింది. శారద సరే సరి! రఘు వెళ్ళాక బెడ్‌రూంలోకి వెళ్ళి గడియ బిగించుకుంది. నేను భారంగా యింటికి వచ్చేసాను.

ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. మళ్ళీ విజయ్ ఎప్పుడొస్తాడో! బహుశా నాలుగునెలల వరకు రాడేమో! నాలుగు నెలలంటే నాలుగు యుగాల్లా అనిపించాయి. మనసంతా దిగులు ఆవరించుకుంది.

వారం రోజులు చాలా నెమ్మదిగా జరిగాయి. ఈ వారం రోజుల్లోనూ ఎన్నో సార్లు నాకు మద్రాసు వెళిపోదామనిపించింది. వెళ్ళనని నాకూ తెలుసు ఆ ఆలోచనే తెలివితక్కువగా ఉందనీ, పగటికలేననీ తెలుసు. అయినా 'మద్రాసు వెళితే' అంటూ ఊహించుకోవడం మొదలుపెట్టాను కాలక్షేపానికి.

ఒకరోజు మధ్యాన్నం వరండాలో కూర్చుని నవల చదువుతున్నాను. పోస్ట్‌మాన్ వచ్చి ఉత్తరాలు విసిరేసి హడావిడిగా వెళ్ళిపోయాడు. అన్నీ చెల్లాచెదురుగా పడ్డాయి. వాడిని తిట్టుకుంటూ ఆ ఉత్తరాలన్నీ ఒకదానిమీద ఒకటి పేరుస్తున్నాను. అన్నీ నాన్నగారికే ఒకదానిమీద మాత్రం నా పేరు ఉంది. నాకు ఉత్తరాలు రాసే వాళ్ళెవరూ లేరు. ఆత్రంగా ఉత్తరం చింపాను. అది విజయ్ దగ్గరనుంచి! ఇలా ఉత్తరం వస్తుందని నేను కలలోకూడా అనుకోలేదు. ఒక్కసారిగా ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొన్నాయి. గబగబా ఉత్తరం చదవటం మొదలుపెట్టాను. విశేషాలేమీ లేవు. సంబోధనలోనూ ప్రత్యేకత లేదు. 'ప్రియమైన పద్మా' అంటూ రాసాడు. నన్ను వెంటనే రాయమన్నాడు ఉత్తరం. అడ్రసు క్రింద రాసాడు. ముగింపులో అతను చేసిన 'నీ విజయ్' అన్న సంతకం నాకు గిలిగింతలు పెట్టినట్టు అయ్యింది.

ఆ ఉత్తరం జాగ్రత్తగా నా చీరల అడుగున దాచాను. సాయంత్రం లోపున కనీసం యిరవై సార్లయినా చదివాను. ఆ రాత్రి పడుకున్న తరువాత కూడా ఉత్తరం గురించే ఆలోచిస్తున్నాను. హఠాత్తుగా విజయ్ వెళ్ళక పూర్వం నేను చేసుకున్న నిర్ణయాలు. వాటికి కారణాలు జ్ఞాపకం వచ్చాయి. ఒక్కసారిగా నేను తప్పుచేసి తిరిగి తెలుసుకున్నట్టు అయింది. అంత గట్టి నిర్ణయాలు చేసుకుని మళ్ళీ నేనెందుకు ఇలా మారిపోయాను! విజయ్‌కి ఉత్తరం రాయకూడదు మళ్ళీ క్రొత్త నిర్ణయం ఇది. ఇలా నా బ్రతుకంతా నిర్ణయాలు చేసుకోవడంలోనే గడిచేట్టు ఉంది.

మరొక పది రోజులు భారంగా గడిచాయి. విజయ్ మళ్ళీ ఇంకొక ఉత్తరం రాసాడు. చాలా కోపంగా రాసాడు. 'ఫూలిష్ పద్మా' అంటూ మొదలుపెట్టి నేను ఉత్తరం రాయనందుకు గట్టిగా తిడుతూ రాసాడు. దీనికీ నేను జవాబు రాయలేదు.

రెండు రోజుల అనంతరం ఇంకొక ఉత్తరం వచ్చింది చాలా హడావిడిగా రాసినట్లున్నాడు. పైన అడ్రసు రాయడమే బరికేసినట్టు రాసాడు. నేను తీరిగ్గా సాయంత్రం వరకూ ఉంచి అప్పుడు చదివాను.

'మై వెరీ డియర్ పద్మా!' అని మొదలు చూసేసరికే నా గుండె కొట్టుకోవటం హెచ్చింది.

'నేను అమ్మకి మన విషయం చెప్పేసాను. కానీ నువ్వు ఫలానా అని గానీ, నీ పేరుగానీ చెప్పలేదు. మిగతా వివరాలు మాత్రం చెప్పాను. అమ్మ నాన్నగారితో చెప్పినట్టుంది. ఇవాళే, ఇంతకు ఒక అరగంట క్రితం ఇద్దరూ నన్ను పిలిచి, నేను ఏ పిల్లని చేసుకున్నా తమకి ఆనందమేనని, నాకై నేను పెళ్ళిచేసుకుంటానని అనటం చాలా సంతోషం కలిగించిందనీ చెప్పారు. నేను నా భార్యని ఎన్నుకోవడంలో తప్పటడుగు వెయ్యనని వాళ్ళకి గట్టిగా 'నమ్మకం' ఉందట!

పద్మా! ఇప్పుడైనా నీకు నమ్మకం కలిగింది కదూ నామీద! నీ

# నువ్వంటే నాకిష్టం

లేకుండా నాకు నిద్రపట్టగా, నీ వివాహం గురించి అమ్మకి చెప్పటం ఇష్టం లేకపోయింది. తిరుగుటపాలో నీ అంగీకారం తెలియజేస్తావని ఎదురు చూస్తూంటాను.

మా అమ్మా నాన్నగారు సంతోషంగా ఒప్పుకుంటారు మన పెళ్ళికి. 'ఒప్పుకుంటా రేమిటి, ఒప్పుకున్నారు. మీ నాన్నగారికీ, అమ్మగారికీ అభ్యంతరం ఉంటుందని నేను అనుకోను. నీ అంగీకారం తెలియజేసిన మరుక్షణం, మిగతా కార్యక్రమం చకచకా జరిగిపోతుంది. మరి నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూంటాను—నీ, విజయ్.

నువ్వు ఉత్తరం రాయకపోతే, నాకు చదువుమీదికి దృష్టి పోవడంలేదు. నేను తప్పితే, పద్మ మొగుడు తప్పాడు అంటారు. మరి నీ యిష్టం—నీ విజయ్.

అంటూ ముగించాడు. నా మనసు పురి విప్పిన నెమలిలా నాట్యం చేసింది. నా నిర్ణయాలు రూపుమాసి పోవడానికి ఒక్క క్షణం కూడా పట్టలేదు. ఆ ఉత్తరం పదేపదే చదువుకున్నాను.

వెంటనే విజయ్‌కి ఉత్తరం రాయాలి. కాని, ఏలా రాయాలి? సిగ్గు ముంచుకు వచ్చింది. పెళ్ళికి నాకు పూర్తి అంగీకారమేనని, ఏలాంటి అభ్యంతరం లేదని...... ఇంకా ఏదో రాయాలి, ఆ ఉద్దేశ్యం కాగితంమీద ఎలా పెట్టాలి? ఉత్తరంద్వారా విజయ్‌కి ఎలా తెలియజేయాలి? ఎన్ని కాగితాలు సగం, సగం రాసి చింపేసానో చెప్పలేను. అయినా ఆ మరునాటి సాయంత్రానికికూడా ఉత్తరం రాయటం కుదరలేదు. నా మనసులో తనిపట్ల గల అనురాగం పూర్తిగా అతనికి అర్థం అయ్యేలా రాయాలన్నదే నా కోరిక. అందుచేత కాస్త ఆలస్యం అయినా, నా ప్రయత్నం పూర్తిగా సఫలం కావాలనే ఇంకా ఇంకా ఏదో ఆలోచిస్తూ, రాస్తూ, చింపేస్తూ, అందమైన కలలు కంటూ, ఊహించుకుంటూ నాకు తెలియకుండానే మూడు రోజులు గడిపేసాను.

ఇంతలో కబురు లేకుండా రామచంద్రపురంనుంచి మాకి పెద్దమ్మ వచ్చింది. పెద్దమ్మకి పిల్లలు లేరు. నేను తన పెంపుడు కూతుర్నని అందరితో చెబుతూ ఉంటుంది. పెద్దమ్మ ఉన్న నాలుగురోజులూ నేను రాసే ప్రయత్నమే చెయ్యలేదు. ఇలాంటి రహస్యమైన పనులు పసిగట్టేస్తుంది పెద్దమ్మ.

పెద్దమ్మ రామచంద్రపురం తిరుగు ప్రయాణం కడుతూ నన్నూ తీసుకు వెళతానంది. అందర్నీ ఒప్పించింది. తప్పనిసరిగా, ఇష్టం లేకపోయినా బయలుదేరాను నేనుకూడా. వెళ్తున్నంతసేపూ అక్కడికి వెళ్ళాక విజయ్‌కి ఏలా వీలు చేసుకుని ఉత్తరం రాయాలో ప్లాన్స్ వేస్తూనే ఉన్నాను. ఇంక ఆలస్యం చెయ్యకూడదని నిశ్చయించుకున్నాను. వీలయితే వెళగానే రాసెయ్యాలి.

హైదరాబాదునుండి రామచంద్రపురం పద్దెనిమిదిమైళ్ళు. ఆ పద్దెనిమిది మైళ్ళూ నూటయాభై మైళలా తోచింది నాకు.

ఆమర్నాడు పెద్దమ్మ వంటచేస్తూంటే, తలనొప్పి వంకతో పడుకుంటానని చెప్పి గదిలోకి దూకి ఉత్తరం రాసేసాను. ఎన్నో ఊహించుకున్నాను ఉత్తరంలో రాయడానికి. వాటిగురించి ఆలోచిస్తే, ఈ అవకాశం పోవచ్చు. అందుకని ఏదో ఇష్టం వచ్చినట్టు రాసేసి, ఉత్తరం కవర్లో పెట్టి అంటించేసాక గుర్తు వచ్చింది, విజయ్ అడ్రసు హైదరాబాదులోనే ఉండిపోయిందని, ఏడుపు వచ్చినంత పనయ్యింది. ఇప్పుడెలా! మళ్ళీ హైదరాబాదు వెళ్ళే వరకూ ఇంతే! ఈ ఆలస్యానికి అతను ఏమని అర్థం చేసుకుంటాడు? నన్ను అపార్థం చేసుకోడు కదా!

ముళ్ళమీద ఉన్నట్టు అనిపించింది రామచంద్రపురం. నా మతిమరుపుకు ప్రతి క్షణం తిట్టుకుంటూనే ఉన్నాను. దీని కంతకూ కారణం అయిన పెద్దమ్మను కూడా తిట్టుకున్నాను. ఏమైనా సరే హైదరాబాదు త్వరగా వెళ్ళిపోవాలి.

వారం రోజుల్లో నన్ను పంపేస్తానన్న పెద్దమ్మ పది రోజులకిగాని వదలలేదు. నేను చాలా కంగారుగా హైదరాబాదు వచ్చాను. అప్పటికి విజయ్ వద్దనుండి ఉత్తరం వచ్చి దాదాపు ఇరవై రోజులు అవుతోంది. అనవసర ఆలస్యం చాలా అయ్యింది, రాసేదేదో తిరిగి రాద్దామని, ఆ మర్నాడు భోజనం చేసాక వరండాలో కూర్చుని మొదలుపెట్టాను ఉత్తరం. చాలా వివరంగా నా ఆలస్యానికి కారణం రాసాను మొదట. ఆతరువాత పెళ్ళి విషయం వచ్చేసరికి మళ్ళీ మొదటికే వచ్చింది వ్యవహారం! ఏం రాయాలో సందేహం! అరగంట ఆలోచించి 'పెళ్ళి విషయం నీ ఇష్టప్రకారం చెయ్యి' అని రాసి ఊరుకున్నాను. సంబోధన ఏమీలేదు. ఉత్తరం ముగిస్తూ ఉండగా గేటుతెరిచిన చప్పుడు అయ్యింది. తలఎత్తి చూస్తే, శారద వస్తోంది! ఈ ఉత్తరం చూసిందంటే, ఎవరికి, ఏమిటి అని అడగక మానదు. అడిగితే అంతా చెప్పేయాల్సి వస్తుంది. అమ్మయ్యో! చెప్పెయ్యటమే! చెప్పకూడదని కాదు గానీ, ఏలా చెప్పటం...' గబ గబా లోపలికి పరిగెత్తి ఆ కాగితాలు బల్ల సొరుగులో పడేసి శారదకి నవ్వుతూ స్వాగతం చెప్పాను.

అక్కడికీ శారద అడగనే అడిగింది— 'ఏమిటే, అంత బిజీగా రాస్తున్నావ్?' అంటూ. నేను కంగారుగా మాట మార్చేసాను వినిపించుకోనట్టుగా. ఇద్దరం కూర్చుని చాలా సేపు మాట్లాడుకున్నాం.

ఉన్నట్టుండి శారద అంది 'అన్నట్టు నీకో ముఖ్య విషయం చెప్పాలి. విజయ్ ప్రేమలో పడ్డాడు' అని ఆగి మళ్ళీ 'ఆ ప్రేమ ఇలాంటి, అలాంటి ప్రేమ కాదు. చాలా ఘాటు ప్రేమ' అని నవ్వింది.

'అయితే శారదకి మా విషయం తెలిసిందన్న మాట. మామూలుగా ఉండడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు. సిగ్గు ముంచుకొచ్చింది.

'ఇంతకీ ఆ అమ్మాయి ఎవరని అడగవేం?' అంది శారద.

నన్ను ఆట పట్టిస్తోందా? లేక పరీక్షిస్తోందా? మళ్ళీ తనే అంది 'సరే! నేనే చెబుతాను. ఆ పిల్ల పేరు లత అట. వాళ్ళ ఫేమిలీ విజయ్‌కి క్రొత్తగా ఫ్రెండ్స్ అయ్యారట. ఆ అమ్మాయి, అంటే లత బి. ఏ. చదువుతోందట మద్రాసులోనే.'

నాకు కళ్ళు చీకట్లు క్రమ్మినట్టయింది. ఏమిటి శారద చెప్పేది! నిజమేనా?


'నిజమా, శారదా?' అని అనుమానంగా అడిగాను.

'అరే! అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏముంది!' అని 'అబ్బా!' ఇక ఆ ...

గురించి ఒకటే రాసేస్తున్నారతే ఉక్క అంది. చూస్తున్నాను యూరం తికంగా తనా చెప్పేది
రాలు! నాకు రెండు రోజులకి ఒక ఉత్తరం ఒకు స్తున్నా తనేనేతుందేమో నోరెం రిం
మే నవ్వేంది. ఒక్కొక్కా టుటం ంది. నన్ను నను ఆదుపులో పెట్టుకోలేక శారద చెయితోంది. 'ఆ ఉత్తరాలు చారెడేసి
భా త. దాన్నిండా ఉత గురించే! పోతున్నాను. ముందంగా శారదకేసి కళా, చారెడేసి కళ్లు వేసు కొని నల్ల


విటమిన్లు మరియు ఖనిజములు మీ కుటుంబముయొక్క
ఆరోగ్యమునకు ఎంతో అవసరము

## వారికి తగినన్ని లభిస్తున్నాయరా ?




విటమిన్లు మరియు ఖనిజముల లోపముతో మీ కుటుంబపు ఆరోగ్యము పాడవవచ్చును. అలసట, బలుపు, ఆకలిలేకపోవడము, నిరుత్సాహము, చర్మము మరియు పళ్ల బాధలు మొదలైనవన్నీ అవసరమైన విటమిన్లు మరియు ఖనిజముల లోపమువల్ల మామూలుగా కలుగుతాయి అయినా విటమిను మరియు ఖనిజములను గురించి అశ్రద్ధ చేయబడుతుంది ఎంతో జాగ్రత్తగా ఆలోచించి తయారుచేసిన ఆహారములో కూడ, సమృద్ధియైన ఆహారమును సరియైన ఆహారము అనుటకు వీలులేదు. ఎన్నో రకముల ఆహారములలో కూడ విటమిన్లు మరియు ఖనిజములు లోపించవచ్చును. కనుక, మీ కుటుంబమునకు ఎంతో అవసరమైన విటమిన్లు మరియు ఖనిజములు తగు పరిమాణములలో లభిస్తున్నాయని ఎలా నిశ్చయము చేసుకోగలరు ?

మీ కుటుంబములో ప్రతి ఒక్కరికి నిశ్చయముగా ఈ అవసరమైన పోషక పదార్థములు వారికి కావలసిన పరిమాణములలో లభించుటకు, వారికి విమ్‌గ్రాన్— స్క్విబ్ వారి వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు యివ్వండి. రోజూ ఒక బిళ్ల చాలును. ఈ ఆరోగ్య సూత్రమును నేడే ఎందుకు అలవాటుచేసుకోకూడదు ?

విమ్‌గ్రాన్‌లో పదకొండు ముఖ్యమైన విటమిన్లు మరియు ఎనిమిది ఖనిజములు ఉన్నాయి. పుష్కలమైన పరిమాణములో. ఇనుము ఎఱ్ఱ రక్త కణములను పెంపొందిస్తుంది మరియు శక్తిని తిరిగి కలిగించుటలో సహకరించును. కేల్షియమ్ ఎముకలను మరియు పళ్లను బలిష్ఠముగా ఉంచుతుంది. విటమిను సి జలుబు రాకుండా అడ్డుతుంది. విటమిను ఎ దృష్టిని బాగుగా మరియు చర్మమును ఆరోగ్యవంతముగా ఉంచుతుంది. విటమిను బి-12 ఆకలిని అధికము చేస్తుంది మరియు సహనశక్తిని కలిగిస్తుంది — ఇంకా, మీ కుటుంబముయొక్క ఆరోగ్యమునకు ఎంతో అవసరమైన యితర ముఖ్యమైన పోషక పదార్థములు ఉన్నాయి.

# విమ్‌గ్రాన్®

వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు

## 11 విటమిన్లు మరియు 8 ఖనిజములు కలది.

## ఒకే ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది.

SQUIBB® SARABHAI CHEMICALS


Shilpi-HPMA-25A/71 Tel.

చెక్కిన విగ్రహంలా ఉంటాడంట. నవ్వితే నవ రత్నాలు రాలతాయట. మాట్లాడితే ముత్యాలు రాలతాయట. నడిస్తే హంసలు సిగ్గు పడతాయట. ఇవన్నీ నా మాట లను కావేవ్! విజయ్ రాశాడు...' పక పకా నవ్వుతోంది శారద. నేను బలవంతాన నవ్వ


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

DOL-327, TEL

వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టరు



విన్నీ మాస్టర్
బ్యాండ్ ఆల్‌వరల్డ్
పోర్టబుల్ ట్రాన్సిస్టర్
(గ్యారంటీతో)
రు. 10 వంతున నెల్లింపు ... అన్ని గ్రామములకు, పట్టణములకు సంవత్సరము ... ధర రు. 165/—

VISHAL AGENCIES
P. B. 2100, (APW) Delhi-7.

తెల్ల వెంట్రుకలుండవు

పొగడడం మాకు ఇష్టం లేదు. కాని మా 'కేశ్ రంజన్' ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లవిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధిపరచును, లాభం పొందినవారు 1000 సర్టిఫికెట్లు మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/—

Western India Co., (S.N.
O. Katri Sarai (Gaya)


# నువ్వంటే నాకిష్టం

బోయాను. సాధ్యపడలేదు.

'విజయ్, లత ఒకటే తిరుగుతున్నారట పార్కులకి, సినిమాలకీ. ఎక్కడ చూసినా వాళ్ళిద్దరేనట. వాళ్ళిద్దరూ కలిసి వెళ్ళని పిక్నిక్ స్పాట్ లేదట ఆ దరిదాపుల్లో! విజయ్ రాసే ఉత్తరాలన్నీ లత గురించే! అబ్బబ్బ! నాకు బోర్ కొట్టేస్తున్నాయి. అక్కడ వాళ్ళ ఫ్రెండ్స్ అంతా అనుకుంటున్నారట వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారని! అదీ తనే రాశాడు!' ఇంకా ఏమేమో చెబుతూనే ఉంది శారద. నా కేమీ వినబడటం లేదు ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. కన్నీళ్ళు పొంగి వచ్చేస్తున్నాయి. ఎలా నిగ్రహించుకున్నానో నాకే తెలియదు.

మధ్యమధ్యలో 'ఏమిటి, అలా ఉన్నావ్' అని అడుగుతూనే విజయ్, లత గురించి చెప్పి వెళ్ళిపోయింది శారద.

నేను పక్కమీద వాలిపోయాను. అప్పటి వరకూ ప్రయత్నంమీద ఆపుకున్న బాధ కన్నీళ్ళ రూపంలో పొంగి వచ్చింది.

ఎంత మోసం చేశాడు విజయ్! నన్ను ప్రేమిస్తున్నట్లు నటించి దగా చేశాడు! ఎలాంటి చైతన్యమూ లేకుండా నిశ్చలంగా ఉన్న నా మనస్సును కదిపి, తన దారిన తాను వెళ్ళిపోయాడు. మోసగాడు! దుర్మార్గుడు! ఎంత బాగా నటించాడు, నన్ను ప్రేమిస్తున్నట్లు! ఎంత కవ్వించాడు! నేను అదంతా నిజమేనని నమ్మేశాను. అది నటనా! కాదు అప్పటికి, ఆ కాస్సేపటికి నిజమే అయి ఉంటుంది. మళ్ళీ అక్కడికి వెళ్ళి, అందమైన ఆడది కనబడగానే అది తుడిచిపెట్టుకుపోయి ఉంటుంది. ఆమె మీద ఆకర్షణ వచ్చి ఉంటుంది. ఛీ! ఏం మనిషి!

ఇలాంటివాడినా నేను ప్రేమించింది? నాకు సరి అయిన పాఠం నేర్పాడు. కసిగా నేను రాసిన ఉత్తరం చింపేశాను.

విజయ్‌ని ఎన్నో తిట్లు తిట్టుకున్నాను మనస్సులో. ఎన్నో విధాల నన్ను నేను ఓదార్చుకో జూచాను. అతని మీద ఎంత అసహ్యం పెంచుకుందామన్నా కుదరటం లేదు. అతనికి మనసు లేదు. కాని... నేను? అతనికి ప్రేమంటే విలువ తెలియదు. నేను అలా కాదు.

ఈ సంఘటన జరిగాకే నేను విజయ్‌ని ఎంత గాఢంగా, గూఢంగా నాకు తెలియకుండానే ప్రేమించానో అర్థం అయింది. అతన్ని మరచిపోలేకుండా ఉన్నాను. మరచి పోవడం అసాధ్యం.

పెళ్ళి మాట తల్చుకుంటేనే నాకు కోపం వస్తోంది. అసహ్యం వేస్తోంది. జీవితంలో మరెవర్నీ నేను పెళ్ళి చేసుకోను. అయిన అనుభవం చాలు.

జరిగినదానికి విచారించి లాభం లేదు కదా! వారం రోజులకి బాగా కోలుకున్నాను. నిర్లిప్తత అలవాటు చేసుకున్నాను. ఈ వారం రోజులలోనూ నాలో నాకే ఎంతో మార్పు కనిపిస్తోంది. ఎంత వద్దనుకున్నా విజయ్ జ్ఞాపకం వస్తూనే ఉన్నాడు.

బయటికి వెళ్ళటం పూర్తిగా మానేశాను. శారద వాళ్ళ ఇంటికి కూడా వెళ్ళటం లేదు అమ్మ, నాన్నగారు చివరికి తమ్ముడు కూడా అడిగాడు 'ఏమిటి, అలా ఉంటు న్నావ్' అని. ఏం చెప్పను!

శారద పదే పదే పిల్చింది వాళ్ళ ఇంటికి రమ్మని. ఒకరోజు వెళ్ళాను, విజయ్ రాసిన ఉత్తరాలు చూపించబోయింది. కాని నేను చూడలేదు అవి చూస్తే నా మనసు నా వశం తప్పవచ్చు. ఇప్పటివరకూ విజయ్ గురించి మాట్లాడటం మానేశాను. శారద మాత్రం ఎప్పుడూ విజయ్ గురించి, అతని ప్రేమకలాపాలు గురించి చెబుతూనే ఉంది.

నెలరోజుల తర్వాత ఒకరోజు శారద చెప్పింది విజయ్ వస్తున్నాడని ఎందుకని అడిగాను, అడగవద్దనుకుంటూనే 'ఏదో ముఖ్యమైన 'పని' ఉందట అతనికి ఇక్కడ.'

మళ్ళీ నాలో అలజడి ప్రారంభం అయింది విజయ్‌ని మళ్ళీ నేను చూస్తూ, ఏటువంటి భావమూ లేకుండా ఉండ గలనా? అతని ఎదుట పడగలనా? ఏదో భయం! కానీ, నా మనసులో ఏ మూలో అతన్ని చూడాలన్న ఆశ! అతను వస్తాడంటే ఆనందం.

ఎప్పుడొస్తాడా అని ఎదురు చూశాను. ఆ రోజు రానే వచ్చింది. వరండాలో నిలుచుని శారదావాళ్ళింటి వైపే చూస్తున్నాను. కారు రావడం చూశాను కారులోంచి శారదా వాళ్ళ నాన్నగారు దిగారు. విజయ్ ఏడీ! ఆత్రంగా చూస్తున్నాను. నల్ల

కళద్దాలు పెట్టుకుని, తెల్లగా, పొడుగ్గా ఉన్న ఒకతను దిగాడు కారులోనుంచి, తేరి పార చూసాను. అవును. అతనే విజయ్. నల్లకళ్ల అద్దాలు పెట్టుకుంటే నేను గుర్తించనేలేదు! ఏదో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. నేను చటుక్కున లోపలకు వచ్చేసాను.

నా ఇష్టం లేకుండానే అతని రాకను గురించి ఎంత ఆనందపడుతున్న నా మనసంటే నాకు చిరాకేసింది. 'విజయ్ వచ్చాడని నేనేం సంతోషించకూడదు' అని పదేపదే మననం చేసుకున్నాను. కాని అది మననం చేసుకోవడం వరకే అయింది. శరీరం ఇక్కడే ఉన్నా మనసు శారదా వాళ్ల ఇంట్లో విజయ్ చుట్టూ తిరుగుతూనే ఉంది. కళ్ళు వాళ్ల ఇంటిమీదే ఉన్నాయి.

ఆ సాయంత్రం విజయ్ ఎక్కడికో కారులో వెళ్లటం చూసాను. అప్పుడు శారద వచ్చింది మా ఇంటికి.

'విజయ్ వచ్చాడు' అంది కాసేపయ్యాక. 'చూసాను' అని నాలిక కరుచుకున్నాను. ఛ! బయట పడ్డానని పించింది.

వచ్చినప్పటినుండి లత ఇంగ్లండు చెబుతున్నాడట విజయ్. లత ఫోటోగ్రాఫ్స్ తీసుకొచ్చాడు సునీకున్నాడటగానీ, శారదనే మద్రాసు తీసుకురమ్మన్నదట లత. ఇంకా ఏమిటేమిటో చెప్పింది శారద. అన్నీ శ్రద్ధగా విన్నాను. లత తెలివితేటల గురించి, అందచందాలగురించి చాలా చెప్పి శారద అంది 'లత తండ్రి మా పెదనాన్నగారు అడుగుతారట ఈ నెలాఖరులో లతను విజయ్‌కి ఇస్తామని. దాదాపు నిశ్చయం అయినట్లే! అయినా లాంఛనాలు ఉంటాయిగా! మా పెద్దమ్మకి, పెదనాన్నకి చాలా ఇష్టం లత అంటే. ఇక విజయ్ సరేసరి. బహుశా పెళ్ళికూడా త్వరలో అయిపోవచ్చు' అంటూ చెబుతోంది.

నేను మరచిపోదామనుకున్న బాధ తిరిగి మొదలు అయ్యింది. నేనిది భరించలేకపోయాను. విజయ్ పెళ్లి లతతో అవుతుందని తెలిసినా, ఇది వినడానికే కష్టంగా ఉంది.

నేను విసుగ్గా అన్నాను 'ఇక ప్రపంచంలో విజయ్, లత వాళ్ళ పెళ్ళి తప్ప మాట్లాడటానికి ఏం లేవా?'

శారద నావైపే పరీక్షగా చూస్తూ అంది 'నీకెందుకు అంత చిరాకు లతంటే?'

నేను కంగారుపడ్డాను. 'ఛ! ఛ! నాకు చిరాకేమిటి?'

'నువ్వు మా ఇంటికి రావేం? విజయ్ ఇందాక అడిగాడు నిన్ను' అంది శారద.

ఎంత సిగ్గులేనివాడు! చేసింది చాలక నన్ను అడిగాడట పైగా! తను నడిపిన షాట్ ప్రేమాయణం అంతా మరచిపోయాడు కాబోలు అప్పుడే!

వెళ్తూ శారద అంది 'రేపు రావాలా?'

'వస్తాను' అని చెప్పాను గాని వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను.

ఆ మరునాడు నేను శారదవాళ్ళ ఇంటి వైపు చూడటం మానేసి, అతి ప్రయత్నం మీద, ఏదో నవల చదువుతున్నాను. శారదా వాళ్ళ ఇంట్లోనుండి కారు వెళ్లిన చప్పుడు అయింది. అంతా ఎక్కడికో బయటికి వెళ్లి ఉంటారు. విజయ్ కూడా వెళ్ళాడేమో! ఇంతలో శారదావాళ్ళ పనిపిల్ల వచ్చింది.

'శారదమ్మగారు మిమ్మల్ని అర్జెంటుగా రమ్మంటున్నారు' అని చెప్పింది.

ఎందుకని అడిగితే తనకు తెలియదంది. విజయ్ ఉంటే ఎలా వెళ్ళటం! విజయ్ ఉన్నాడో, బయటికి వెళ్ళాడో కనుక్కుందామనుకుని, అతని పేరు చెప్పటం ఇష్టం లేక 'చుట్టాలు ఉన్నారా?' అని అడిగాను.

'చుట్టాలెవరూ లేరండీ!' అంటూ పరిగెత్తిందా పిల్ల. నేనూ వెనుకే వెళ్ళాను. ఇప్పుడే విజయ్ ఉంటే! నా ఊహకే నాకే నవ్వు వచ్చింది.

హాల్లోకి అడుగుపెడుతూ ఆగిపోయాను. ఎదురుగుండా సోఫాలో విజయ్ కూర్చుని పేపర్ చదువుతున్నాడు. నాకు గుండె ఝల్లుమంది! అలాగే నిలబడిపోయాను.

విజయ్ నన్ను చూడగానే 'హల్లో! రా! రా!' అంటూ నవ్వుతూ పిలిచాడు.

అతను మామూలుగానే ఉన్నాడు. అలాంటప్పుడు నేను భయపడటం దేనికి?

నేను లోపలకు అడుగువేసి హాల్లోకి ప్రవేశించాను. 'కూర్చో!' అన్నాడు సోఫా చూపుతూ.

నేను కూర్చోకుండా, కనీసం అక్కడ ఆగకుండా లోపలికి వెళబోతూ అన్నాను 'సారీ! శారదతో పనిఉండి వచ్చాను' నీకోసం రాలేదు అన్న భావం ధ్వనింపజేస్తూ నిర్లక్ష్యంగా అతనంటే లెక్కలేనట్టు అన్నాను. అని ఊరుకోలేదు. అతని ముఖం ఎలా ఉంటుందో చూశాను. నేను ఆశించినట్లు అతను చిన్నబుచ్చుకోలేదు.



'ఆ సంగతి నాకూ తెలుసుగానీ. కూర్చోవోయ్! శారద నన్ను ఇక్కడ అందుకే కూర్చోబెట్టింది. నువ్వు రాగానే రిసీవ్ చేసుకోమంది. తను లోపల పనిలో ఉంది. వచ్చేస్తుంది కూర్చో!' అన్నాడు తన మామూలు ధోరణిలో.

అయినా నేను మొండిగా 'నేనే లోపలికి వెళ్తాలే' అంటూ వెళ్ళబోయాను.

విజయ్ వెంటనే 'శారదా, శారదా!' అంటూ గావుకేకలు పెట్టి పిల్చాడు.

నేను అక్కడే నిలబడి పోయాను ఏమీ తోచనట్టు. శారద హంస నడకలతో వచ్చింది. వస్తూనే అంది.

'వచ్చావా! కూర్చో నేనిప్పుడే వస్తా స్నానం చేసి' అంటూ లోపలికి వెళ్ళబోయింది.

నాకు చాలా కోపం వచ్చింది. తను స్నానంచేసి వచ్చేవరకూ నేను ఏం చేయాలి! 'సరే! తర్వాత మళ్ళీ వస్తాలే' అంటూ వెనక్కి తిరిగాను.

శారద గబగబా వచ్చి నాచెయ్యి పట్టుకుని లాగింది, 'వెళ్ళిపోకు. నీతో చాలా అర్జెంటుపని ఉంది కూర్చో!'

నేను ఉండనా, వద్దా అని సందేహంగా చూశాను తనవైపు. 'ప్లీజ్! కూర్చో!' అంది బ్రతిమాలుతూ

నేను ఇంక బాగుండదని సోఫాలో కూర్చున్నాను. తను 'ఇప్పుడే రెండు నిముషాల్లో వచ్చేస్తా!' అని నాతో చెప్పి విజయ్ వంకకు తిరిగి 'పద్మను ఎంటర్‌టైన్ చెయ్యి నేను వచ్చేలోగా! అన్నట్టు మీ అత్త గురించి చెప్పు, నీకు విసుగు లేదుగా!' అని నవ్వి లోపలికి వెళ్ళి, మళ్ళీ వచ్చింది.

'మరిచేపోయాను! అత్త అంటే వీడుకో గాని పద్మకి మహా చిరాకు. ఇంకేవైనా కబుర్లు చెప్పు తనకి' అంది.

నేను కంగారుగా చూశాను విజయ్ వంక. 'నాకు అతంటే చిరాకు' అన్నదానికి అతను ఏం అర్థాలు తీస్తాడో! నేనెందుకు బయట పడలి అతని ముందు.

'ఛ! నాకు అతంటే చిరాకేమిటి? శారదానివే, ఎవరు చెప్పారు?' హడావుడిగా అన్నాను.

'మరి నువ్వు నిన్న చెబుతుంటే 'సు... కదా! ఈ విజయ్ అతగురించి

# నువ్వంటే నాకిష్టం

చెప్పడం మొదలు పెట్టాడంటే తనకి ఒళ్ళు తెలియదు.' నవ్వి శారద వెళ్ళిపోయింది.

విజయ్, నేను దిక్కులు చూస్తూ కూర్చున్నాం కాసేపు. పరిచయం లేని వాళ్ళలా ఉంది మా వ్యవహారం!

'అంత చిక్కిపోయావేం పద్మా!' ఉన్నట్టుండి మృదువుగా అన్నాడు విజయ్!

నేను చిక్కితే ఇతనికెందుకు? లావైతే ఇతనికెందుకు? తనకీ, నాకు ఏమిటి సంబంధం?

మళ్ళీ అతనే అన్నాడు 'బొత్తిగా నల్లపూసైపోయావేం? ఎక్కడా కనబడటం లేదు.'

అంటే, ఇతను వస్తే ఎదురేగి స్వాగతం చెప్పాలా! నివాళులివ్వాలా! నేనేం మాట్లాడలేదు.

'సరే, పోన్లే! శారద నీకు కబురు చెప్పమందిగా, ఏం చెప్పను?' అని మహాబలిపురం సంగతి ఎత్తాడు. అది మద్రాసు దగ్గర ప్రదేశమట. వాళ్ళీ మధ్యనే పిక్నిక్ వెళ్ళి వచ్చారట వాళ్ళల్లో అత్త కూడా ఉందట. టాపిక్ అత్త మీదికి మళ్ళింది. నేను మౌనంగా వింటున్నాను.

అతని గురించి ఉత్సాహంగా చెప్పడం మొదలుపెట్టాడు. నేను అతన్నే పరీక్షగా చూస్తున్నాను. ఇతనికేం సిగ్గు లేదా, బిడియం లేదా! అతనికి మనసనేది ఉందా!

విజయ్ మాటలకి నాలోని బాధ ఉవ్వెత్తు లేచింది. శక్తినంతా కూడదీసుకుని అడిగాను.

'నువ్వు, అత్త పెళ్ళి చేసుకుంటారట కదా?'

విజయ్ నవ్వాడు. చాలా అందంగా, తేలిగ్గా నవ్వాడు.

'ఆఁ! అందరూ అలాగే అంటున్నారు. మా నాన్నగారు ఈ నెలాఖరులో ప్రపోజ్ చేస్తారట. అత్త ఒప్పిందట.' తాపీగా చెప్పాడు.

ఇతనికి బాగా బుద్ధి చెప్పాలి. ఇలాటి వాడిని కట్టుకుని ఆ అత్త మాత్రం ఏం సుఖపడుతుంది! ఏమైనా ఇతను సీరియస్‌గా తీసుకుంటే అంతే చాలు.

'నువ్వు అత్తని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నావా?' నెమ్మదిగా అడిగాను.

'సిల్లీ ప్రశ్న!' నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు. అత్తని చేసుకోకపోతే ఇంకెవర్ని చేసుకుంటాను అన్నట్టుంది అతని వాలకం.

'నీకు అత్తంటే అంత ప్రేమా!' పళ్ళ బిగువున అడిగాను.

అతను అదోలా నవ్వి అవునన్నట్టు తల ఊపాడు. భగ్గుమంది మనసు.

'నే నొకటి అడుగుతాను. సమాధానం చెబుతావా?' కంఠాన్ని అదుపులో పెట్టుకుంటూ అడిగాను.

విజయ్ ఇదేమీ పట్టనట్టు 'విత్ ప్లెజర్' అన్నాడు నిర్లక్ష్యంగా.

'నువ్వు ఇదివరకు ఎంతమందిని ఇట్లా ప్రేమించావ్! ఇక ముందు ఎంతమందిని ప్రేమిస్తావ్?' చాలా కఠినంగా అడిగాను.

విజయ్ ఏమీ మాట్లాడలేదు. నా వంకే కళ్ళు విప్పార్చుకుని చూస్తున్నాడు, ఏదో నా ముఖంలో వెదుకుతున్నట్టు. నేను అనుకున్నట్టు కోపం తెచ్చుకోలేదు. చిన్నబుచ్చుకోలేదు.

నేను మళ్ళీ అన్నాను 'విజయ్! నువ్వు వెంటనే అత్తని పెళ్ళి చేసుకో! కానీ ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో! ఏలాగా ఆడవాళ్ళంతా చంచల మనస్తత్వంతో ఉంటారనుకోకు. వాళ్ళకు మనసులున్నాయని, ప్రేమ, బాధ తెలుసునని జ్ఞాపకం ఉంచుకో...' గొంతు పూడుకుపోయి మాటలు రాలేదు ఆపైన. కన్నీళ్ళు ఉబికి వచ్చేశాయి. వాటిని ఆపడం అసాధ్యం అయింది. నేను తల దించుకున్నాను.

వెంటనే విజయ్ తను కూర్చున్న చోటు నుంచీ లేస్తూ చప్పట్లు కొట్టాడు చిన్నగా. 'సక్సెస్! గ్రాండ్ సక్సెస్! ఈ రిజల్ట్ కోసం ఎంత కష్టపడాల్సి వచ్చింది!'

అతను అంటున్నదేమిటో నాకు అర్థం కాలేదు. అతనివైపు చూశాను. కళ్ళు గర్వంగా మెరుస్తున్నాయి. ముఖం వెలిగిపోతోంది.

'నువ్వేమీ ఇంక చెప్పనక్కరలేదు' అంటూ నా దగ్గరగా వచ్చేసి నా ప్రక్కనే కూర్చున్నాడు.

నా బుగ్గల మీద కన్నీళ్ళు తుడిచాడు చొరవగా. నేను ప్రతిఘటించే స్థితిలో లేను.

'పిచ్చి పద్మా! నీకోసం మూడు ఎం

నాటకం ఆడవలసి వచ్చిందో! ఒక అతని సృష్టించి, ఒక ప్రేమ కథని అల్లి... అబ్బుబ! విసుగేసింది.!

నేను ఆశ్చర్యంగా విజయ్‌కేసి చూసాను. 'నిజంగానా! ఇదంతా నాటకమేనా?' నమ్మలేనట్లు అడిగాను.

అతను మృదువుగా చెప్పాడు 'నిజం పద్మా! నీకోసం ఇంత నాటకం ఆడవలసి వచ్చింది!'

నావంక పరీక్షగా చూసి మళ్ళీ అన్నాడు 'సారీ పద్మా! నిన్ను బాధపెట్టాను కదూ? నిన్ను బాధపెట్టి, నేను బాధపడి.. ప్చ్! దీనికంతకూ నువ్వే కారణం!'

నా మనసు చాలా తేలిక అయ్యింది. సంతోషం పట్టలేకుండా ఉన్నాను. ఇన్నాళ్ళూ నేను పడ్డ బాధ క్షణంలో మాయం అయింది.

కాస్త ఆగి విజయ్ అన్నాడు 'దీనికంతకూ నీ మొండితనం కారణం! నిన్నేం చెయ్యాలి.' అన్నాడు. నేనతని వైపు అదోలా చూస్తూ.

నేను తల దించుకున్నాను.

'అన్నట్టు శారదకి నా తరఫున థాంక్స్ చెప్పాలి. తను నాకు చాలా సహాయం చేసింది!' అన్నాడు విజయ్ నవ్వుతూ.

అయితే, ఇద్దరూ కలిసి ఆడిన నాటకం అన్నమాట ఇది! నాకు కోపం వచ్చింది! వీళ్ళిద్దరికీ ఆటలా ఉండేమో గాని, నేనెంత బాధపడ్డానో వీళ్ళకేం తెలుసు! నేను లేచి పోలుగోళ్ళకు గుద్దులు వేసాను.

నా మనసులో భావం అర్థం అయినట్లు విజయ్ అన్నాడు 'ఏంచెయ్యను చెప్పు మరి, నువ్వు నీ ఉత్తరాలకి జవాబులు రాయకపోతే! నిన్ను ఒప్పించడానికి ఇంతకంటే మార్గం కనబడలేదు. పని వంక పెట్టుకుని అందుకే వచ్చేసాను ఇక్కడికి.'

మళ్ళీ అన్నాడు 'ఇంతకీ అసలు విషయం చెప్పు! ఇప్పటికైనా ఒప్పుకున్నట్లేనా పెళ్ళికి.'

నా దగ్గరగా వచ్చేస్తున్నాడు. నాకు తిరిగి చూసాను. అతను బయటికి వెళ్ళిపోయాడు. బెల్ మోగింది. అక్కడినుంచి ఒక్క పరుగున గేటువరకూ వచ్చేసి, వెనక్కి నావంకే చూస్తున్నాడు నవ్వుతూ.

(అయిపోయింది)

---

రసవర్గాలూ - గుణాలూ :

# ఆవాలు

సాధారణంగా మనవాళ్ళు పోపులన్నింటిలోనూ తగుమాత్రం ఆవాలు వాడుతుంటారు. ఇకపోతే ఆవపెట్టి కొన్ని కూరలు పులుసు వండుతుంటారు. కొన్ని ఊరగాయలలో ఆవగుండ వాడుతుంటారు.

ఈ ఆవాలలో ఎరుపు, నలుపు, తెలుపు, రంగులుగల మూడు జాతులు ఉన్నాయి. ఇక పోతే సన్నావాలుకూడా కొన్ని ప్రాంతాలలో అధికంగా పండుతుంటాయి.

ఇవి కాకచేస్తాయి. కఫం, వాతం, రేచీకటి, అజీర్ణం, శుక్లవాతం, శ్వాస, శూల, పీనస, అగ్నిమాంద్యం, దురదలు, దద్దుర్లు విసర్పి వీనిని పోగొట్టడానికి తోడ్పడతాయి. ధాతువులకు బలాన్ని చేకూరుస్తాయి. మెదడులోని చెడు నీరును ఆర్పివేస్తాయి. జీర్ణశక్తిని పెంపొందించి ఆకలి పుట్టిస్తాయి. కడుపులోని వాతాన్ని హరిస్తాయి. కుష్ఠు, క్రిమి పక్షవాతం, ఉదరరోగం గలవారికి మేలు చేస్తాయి.

అతి త్రాగుడుచే స్మృతి తప్పి పడియున్నవారికి, ఏదైనా విషపదార్థం తినినవారికి గురుత్వ పదార్థాలనుగాని, సులభంగా జీర్ణం కాని కఠిన పదార్థాలుగాని, అమితంగా తినినవారికి వాంతి చేయించడానికి ఆవాలను ఉపయోగించవచ్చు. తగు మోతాదులో బాగా నలుగగొట్టబడిన ఆవాలను ఒకటి రెండు డ్రాముల చన్నీళ్లతో లోనికి యిచ్చిన మనిషిని నీరస పరచకుండా వాంతి చేయించి, కడుపును శుభ్రపరచును.

ఆవాలను నలుగగొట్టి, వేడినీళ్లతో చేసిన తేలిక కషాయం, పూటకు నాలుగైదు సార్లు చొప్పున కొన్ని దినములు యిచ్చినట్లయితే పక్షవాతం తగ్గుతుంది.

ఆవాల్ని నలుగగొట్టకుండా పూటకు సుమారు ఒక టేబుల్ స్పూన్‌ఫుల్ చొప్పున ప్రొద్దుట సాయంత్రం ఉదర రోగులకు చన్నీళ్లతో మింగించిన అధికంగా మూత్రం వెలువడుతుంది. విరేచన మవుతుంది. పొట్టకు బలం చేకూరుతుంది. ఆకలి పుడుతుంది.

ఆవాల చూర్ణంలో నీళ్ళుగాని, సిరికాగాని, పోసి బాగా కలిపి వాత నొప్పులచోట పట్టు వేసిన లేక మర్దన చేసిన వాతనొప్పులు తగ్గుతాయి.

ఆవాలు పైత్యాన్ని, రక్త పైత్యాన్ని, వృద్ధిపొందిస్తాయి. వీనియొక్క దుర్గుణాలకు విరుగుళ్లు:— 1. నెయ్యి. 2. కలినీళ్లు. 3. పెరుగు.

సన్నావాలకుకూడా చాలా వరకు ఆవాలకు గల గుణాలే ఉన్నాయి. ఇవి పెద్దావాలుకంటే శక్తివంతంగా పనిచేస్తాయి.

# మెంతులు

మనవాళ్ళు కొన్ని కూరలు మెంతి పెట్టి వండుతుంటారు. మెంతులు వేడిచేసి ఆర్పుతాయి. మేహశాంతి చేకూరుస్తాయి. వీపునొప్పిని లివర్‌నొప్పిని, తగ్గిస్తాయి. ధాతువులకు బలాన్ని చేకూరుస్తాయి. స్త్రీల ఋతురక్తాన్ని బాగా జారీ చేయిస్తాయి. స్పెర్మ్‌నకు సత్తువను చేకూరుస్తాయి. దగ్గును, కఫాన్ని హరిస్తాయి. హృదయాన్ని శుభ్రపరుస్తాయి.

వేయించిన మెంతుల తేలిక కషాయం తగు మోతాదులో ఉదయం సాయంత్రం త్రాగినా మెంతులు వెన్నలో కలిపి తిన్నా— రాత్రి పడుకోబోయేముందు నీళ్లతో తగుమోతాదులో మెంతులు పుచ్చుకున్నా రక్తగ్రహణి కడుతుంది. చిన్న నిమ్మకాయంత వెన్నలో ఒక ఉల్లిపాయను సన్నంగా తరిగి తగుమోతాదులో మెంతులు కలిపి ఉదయం, సాయంత్రం తగు మోతాదులో తిన్నట్లయితే గ్రహణి, రక్తగ్రహణి, కడతాయి. మెంతులు అచ్చంగా కాని, వెన్న మొదలగువానితో గాని పుచ్చుకొనెడి మోతాదు $\frac{1}{8}$ తులం మొదలు అర తులం వరకు. మెంతుల్ని నమలకుండా మింగాలి.

మెంతుల పిండిని నీళ్లతో ఉడికించి గెడ్డలపై వేసి కట్టు కట్టినట్లయితే అవి శీఘ్రంగా మెత్తబడి చితుకుతాయి. ఈ పిండిని వేసి ముల్లు విరిగిన చోట కట్టినట్లయితే ముల్లు సులభంగా ఊడివస్తుంది.

మెంతులు అమితంగా తింటే పైత్యవికారం ఎక్కువవుతుంది. తలనొప్పి వస్తుంది.

దీని యొక్క దుర్గుణాలకు విరుగుళ్లు:— 1. పులుసు. 2. పుల్లదానిమ్మ, 3. మేక కడుపులోని పిల్ల మాంసము 4. సికంజబీను.

సేకరణ: ఆకుండి నారాయణమూ